క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్, అశోక జంక్షన్, గాంధీనగర్, టైలర్స్ స్ట్రీట్, కాకాజీకాలనీ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, సిటిజన్ క్లబ్, మెడికవర్ ఆస్పత్రి, వాసవి కాలనీ, దుర్గాదేవి కాలనీ, భద్రకాళి బండ్, విశాల్ మార్ట్, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్


స్వామి


రమేష్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. తెలంగాణ గిరిజన కథా సంపుటాలు జనజీవన చిత్రణ అనే అంశంపై తెలుగు విభాగం పరిశోధకుడు బానోతు స్వామి సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహచారి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి పర్యవేక్షణలో స్వామి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, కేకే రంగనాథచార్యుల రచనలు – ఒక అధ్యయనం అనే అంశంపై తెలుగు విభాగానికి చెందిన జిడి రమేష్ సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు నర్సింహచారి పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి పర్యవేక్షణలో రమేష్ పీహెచ్‌డీ పూర్తిచేశారు.

పర్యావరణ అవార్డు ప్రదానం

కాజీపేట: రాష్ట్ర స్థాయి పర్యావరణ పరిరక్షకుడి అవార్డును కాజీపేట పట్టణానికి చెందిన కె.ప్రకాశ్ దక్కించుకున్నారు. గత కొన్నేళ్లుగా అటవీ ప్రాంతంతో పాటు రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడం, గుట్టల్లో విత్తనాలు చల్లడం, ప్లాస్టిక్ నిర్మూలన, మట్టి గణపతుల ఏర్పాటు ఉద్యమంలో ప్రకాశ్ కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన ప్రజా హృదయం సోషల్ సర్వీస్ సొసైటీ సంస్థ రాష్ట్ర స్థాయి అవార్డుతో సన్మానించింది.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ 17వ డివిజన్ గాడిపెల్లి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో 8మంది పేద విద్యార్థినులకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ గద్దె బాబు హాజరై విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకన్న, ఉపాధ్యాయులు ప్రవీణ్, పాపిరెడ్డి, నాయకులు దామోదర్, వీరస్వామి, హరీష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కాజీపేట అర్బన్: న్యూశాయంపేటలోని శ్రీరాజరాజేశ్వరి ఆటో యూనియన్ సభ్యుడు ఆటో డ్రైవర్ సత్తు శ్రీధర్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.30 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వేల్పుల సాంబమూర్తి, కోశాధికారి రాసమల్ల సురేష్, సత్యం, లక్ష్మణ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్న సంస్థలకు ఆహ్వానం

న్యూశాయంపేట: వరంగల్ జిల్లా పరిధిలోని రంగశాయిపేట శివారు జక్కలొద్ది మైనారిటీ గురుకులంలో నిరుపయోగమైన వస్తువులు (నోట్‌బుక్స్, న్యూస్ పేపర్, ప్లాస్టిక్ వస్తువులు) కొనుగోలు చేసేందుకు ఆసక్తి గల సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9లోపు గురుకులంలోని కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

భావ వ్యక్తీకరణలో భాష ముఖ్యం

కేయూ క్యాంపస్: భావ వ్యక్తీకరణంలో భాష ప్రధాన భూమిక పోషిస్తుందని సెల్ట్ డైరెక్టర్ డాక్టర్ మేఘనారావు అన్నారు. విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో 40 రోజులపాటు నిర్వహించే స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో మాట్లాడారు.

సమస్యలు పరిష్కరించాలి

కాశోజీ సెంటర్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు వరంగల్ కలెక్టర్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, నాయకులు సందేశ్, సిద్ధార్థ, అజయ్, రవికుమార్, యువ, రాహుల్, వంశీ, పృథ్వీ, అజహర్, అఖిల్, గణేశ్ పాల్గొన్నారు.

పీఆర్టీయూటీ అసోసియేట్ ఎన్నిక

కాశోజీ సెంటర్: పీఆర్టీయూటీ అసోసియేట్ మహిళా విభాగం వరంగల జిల్లా అధ్యక్షురాలిగా ప్రతిభ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రతిభను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షురాలు కొలిపాక సంగీత, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా పీఆర్టీయూటీ అసోసియేట్ అధ్యక్షురాలిలుగా పర్వతగిరి పాఠశాలకు చెందిన తిరుమలను ఎనుకున్నట్లు పేర్కొన్నారు.

రాజ్‌పుత్ వాడలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, తదితరులు



సోమిడిలో ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ రవీందర్ యాదవ్, స్థానికులు



36వ డివిజన్ చింతల్‌లో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, తదితరులు



పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలో పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. పరిశుభ్రత, పచ్చదనం ఆవశ్యకతను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


హసన్‌పర్తి: ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ జక్కుల రజిత, అధికారులు, తదితరులు


దర్గా ప్రభుత్వ పాఠశాలలో..


31వ డివిజన్‌లో..


14వ డివిజన్‌లో..


ఖిలా వరంగల్: కరీమాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ రవి, తదితరులు


ఖిలా వరంగల్: మాట్లాడుతున్న కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ


35వ డివిజన్ శివనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, తదితరులు

ఎన్‌సీసీ కేడెట్లకు ఉజ్వల భవిష్యత్

విద్యారణ్యపురి: ఎన్‌సీసీ కేడెట్లకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎన్‌సీసీ 8వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రవికుమార్ అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగంలో అడ్మిషన్లు జరుగుతున్న తీరును ఆయన సోమవారం పరిశీలించారు. కేడెట్లు చేస్తున్న సామాజిక కార్యక్రమాల వివరాల రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ సమయంలో క్రమశిక్షణతో పాటు ట్రెనింగ్, మ్యాప్ రీడింగ్, ఆర్మీట్రెనింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కమాండింగ్ ఆఫీసర్, కల్నల్ డాక్టర్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, ఎన్‌సీసీ కేర్ టేకర్ డాక్టర్ కల్పన, అలియా, ఇటాలియన్ సుబేదారి మేజర్ రమణారావు, హవల్దార్ ధర్మారావు, ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్ అవంతి, జూనియర్ అండర్ ఆఫీసర్ దివ్య పాల్గొన్నారు.


ఎన్‌సీసీ కేడెట్లతో రవికుమార్, అధ్యాపకులు

సబ్ రిజిస్ట్రార్‌కు సన్మానం



ఖిలా వరంగల్: వరంగల్ హంటర్ రోడ్డులోని కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా జి.నరేంద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ అజ్మీర కారీక్ ఖమ్మంకు బదిలీ అయ్యారు. కాగా, నరేంద్రను మండల డాక్యుమెంటరీ రైటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్ నేతృత్వంలో బొడ్డు శ్రీనివాస్ నారబోయిన రాజు, సీహెచ్.రమేష్, ఓదెల నర్సింగం, కోమాకుల రాజేష్, సాయి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్‌ను న్యాయవాది శామంతుల శ్రీనివాస్ కలిశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మెరుగు సుభాష్, ఓంప్రకాశ్, ఓదెల నర్సింగం, ప్రభాకర్, పూస రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


అవినాష్ కళాశాలపై చర్య తీసుకోవాలి


కళాశాల ఫ్లెక్సీని దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు


హన్మకొండ: అనుమతి లేకుండా నడుస్తున్న అవినాష్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హనుమకొండ అంబేడ్కర్ కూడలిలోని అవినాష్ ఇన్‌స్టిట్యూట్ ఎదుట వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. అవినాష్, భద్రుక కళాశాలల ఫ్లెక్సీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు ప్రణీత్ గౌడ్, పీడీఎస్‌యూ నగర కార్యదర్శి రాచకొండ రంజిత్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్ నాయక్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు, గుర్తింపు లేకుండా అవినాష్ యాజమాన్యం ఇంటర్, డిగ్రీ ప్రవేశాలు తీసుకుంటోందని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల చరణ్, కుక్కల కుమార్, జక్కుల భాను, కసరబోయిన రవితేజ, పవన్, రాజు, మహేష్, శివ, వంశీకృష్ణ, కిరణ్, రాజేష్, నరేష్, రాజు పాల్గొన్నారు.

కేరళ వరద బాధితులను ఆదుకోవాలి

ఖిలా వరంగల్: ప్రకృతి విలయంతో తీవ్రంగా నష్టపోయిన కేరళ వరద బాధితులకు మానవతా దృక్పథంతో ఆదుకోవాలని సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, సీపీఎం వరంగల్ జిల్లా కార్యవర్గవర్గ ముక్కెర రామస్వామి పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ కరీమాబాద్ తోపాటు పలు ప్రాంతాల్లో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో వేర్వేరుగా ఇంటింటా, వ్యాపార వర్గాల నుంచి సోమవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేరళ రాష్ట్రం వరద బీభత్సం వల్ల వ్యాపార సముదాయాలు, రోడ్లు భవనాలు నీట మునిగి ఆర్థిక నష్టం సంభవించాయని, అంతేకాదు మానవ సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు దండు లక్ష్మణ్, బుస్స రవీందర్, గన్నారపు రమేష్, దామెర కృష్ణ, అక్బర్‌పాషా, ల్యాదల్ల శరత్, జాన్‌పాల్, నరేష్, మనోహర్, సువర్ణ, జన్ను రాజు, శంశొద్దీన్, సీపీఎం నేతలు ప్రభాకర్, వాణి, ఇస్మాయిల్, యాకూబ్‌పాషా, శ్రీను, లక్ష్మి, మురళి, ఉపేందర్, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఆయుర్వేద ఆస్పత్రిలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న ఆయుర్వేద వైద్య విద్యార్థులు

కాశిబుగ్గ: తలసేమియా బాధితులను ఆదుకోడానికి దాతలు ముందుకు రావాలని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి కోరారు. ఈమేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సహకారంతో వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానమని, ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. ఈ శిబిరంలో 30 మంది వైద్య విద్యార్థులు, వైద్యులు, సిబ్బంది రక్తదానం చేశారు. శిబిరంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్, వైద్యులు జగన్మోహనచారి, హరికిషన్, మహేష్ పాల్గొన్నారు.

దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగం హేయమైన చర్య

హన్మకొండ: దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం హేయమైన చర్య అని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు థర్డ్ డిగ్రీ ప్రయోగించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ సైబరాబాద్ పరిధి షాద్‌నగర్ పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సునీత, భీమయ్య దంపతులను ఓ దొంగతనం ఆరోపణలపై పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ఆ దళిత మహిళపై చెప్పలేని రీతిలో జై భీమ్ సినిమా తరహాలో పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని తెలిపారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంటాల దేవ డిమాండ్ చేశారు. ఓ దొంగతనం కేసులో అరెస్టు చేసి తీవ్రంగా వేధించారని వాపోయారు.

సంక్షిప్తంగా

గర్భవతిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

మడికొండ: తనతో పాటు గర్భవతి అయిన తన భార్యపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఓ వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం ధర్మసాగర్ మండలం సాయిపేట గ్రామానికి చెందిన చేపూరి శ్రీధర్.. తన భార్య అనూషతో కలిసి అత్తగారి గ్రామమైన రాంపేటకు వెళ్లాడు. ఆదివారం మధ్యాహ్నం కేశవాపూర్ మండలం ఆముదాలపల్లికి చెందిన మెడెదల అమిత, మెడుదల రాజయ్య, పులినేని పోచమల్లు, మరో వ్యక్తి కలిసి శ్రీధర్ మామ సమ్మయ్య ఇంటిపైకి వచ్చి దాడి చేశారు. అనూషపై దాడి చేయడంతో కడుపులో ఉన్న శిశువు మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు శ్రీధర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

నిధులు విడుదల చేయాలి

కాజీపేట అర్బన్: దళితుల నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ డిమాండ్ చేశారు. కాజీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం చేపట్టిన ధర్నా చేపట్టి తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఎన్నికల తరుణంలో చేవెళ్ల సభలో ఎస్సీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలైన అంబేడ్కర్ అభయ హస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు, వసతి గృహాల పున నిర్మాణం, ఎస్సీలకు శాశ్వత ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం వంటి హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బన్న ప్రభాకర్, నార్లగిరి రామలింగం, చాంద్‌పాషా, జీవన్ ప్రకాష్, శివ, శ్రావణ్‌యాదవ్, రాజ్‌కుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

హసన్‌పర్తి: చదువుకు పేదరికం అడ్డుకాదని సైకాలజిస్ట్ కె.దామోదర్ అన్నారు. హసన్‌పర్తి మండలం చింతగట్టు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యారణ్యపురి సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్కార వికాస శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నతంగా ఆలోచిస్తూ ఉన్నతమైన విలువలతో జీవిత లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ, అసోసియేషన్ గ్రామశాఖ అధ్యక్షుడు కోమటి రాజేందర్, మాజీ సర్పంచ్ రాజమల్లమ్మ పాల్గొన్నారు.

పీఠాధిపతి భూక్య బాబురావుకు సన్మానం

హన్మకొండ కల్చరల్: వరంగల్ తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావును కొమురం భీం అవార్డు గ్రహీత, పోటీపరీక్షల శిక్షకుడు, పరిశోధక విద్యార్థి పృథ్వీకుమార్ చౌహాన్ సన్మానించారు. వరంగల్ హంటర్‌రోడ్‌లోని పీఠంలో బాబురావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చూరెపల్లి రవికుమార్, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, పరావస్తు విజయలక్ష్మి, సునంద, అశోక్, కస్తూరిబాయి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరిశోధనలో మెట్రిక్స్ ప్రధాన భూమిక

కేయూ క్యాంపస్: పరిశోధనలో మెట్రిక్స్ ప్రధాన భూమిక వహిస్తాయని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. కేయూలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ పరిశోధక విద్యార్థుల కోర్సు వర్క్ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశోధకులు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ విశాల మహేందర్, విభాగాల అధిపతులు డాక్టర్ రాధిక, డాక్టర్ బిక్షాలు, ఆసిం ఇక్బాల్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పాపన్న జయంతి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్లను జైగౌడ ఉద్యమం ఉమ్మడి వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోల్తి కిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్ వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 11న ఉదయం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌గౌడ్, బాధ్యులు జనగాం శ్రీనివాస్, డాక్టర్ చిర్ర రాజు, వడ్లకొండ వేణుగోపాల్, నాగురాజు, వెంకటనర్సయ్య, సాయి బాబా, రాజేష్, చిర్ర రమేష్, జిల్లా యూత్ నాయకులు బొమ్మగాని వెంకటేష్, శ్రీకాంత్, విప్లవ్, హరికృష్ణ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్‌లో చేరిక

దేశాయిపేట: ఏనుమాముల పరిధిలోని 3వ డివిజన్ స్టాలిన్‌నగర్ కాలనీ, పైడిపల్లి, ఏనుమాముల, దేశాయిపేట, కొత్తవాడలకు చెందిన పలువురు నాయకులు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీలో సోమవారం చేరారు. ఈమేరకు వారికి పార్టీ తెలంగాణ రాష్ట్ర గైడ్ ఎస్.మూర్తి, కార్యదర్శి రమేష్, రావుల రాజు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో యాదగిరి, ప్రసంగి, సుష్మిత, ప్రమీల, చిట్టి, రవి, పాషా, రాజలింగం పాల్గొన్నారు.

బీఎస్ఆర్‌కేఎస్ ఆవిర్భావ వేడుకలు

మడికొండ: భవన నిర్మాణ రంగం కార్మిక సంఘం (బీఎస్ఆర్‌కేఎస్) ఆవిర్భవించి 21ఏళ్లు పూర్తైన సందర్భంగా మడికొండలో సోమవారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను బీఎస్ఆర్‌కేఎస్ హనుమకొండ జిల్లా కార్యదర్శి కాశేశ్వరపు రాజేందర్ ఆవిష్కరించారు. అలాగే, అయోధ్యపురం, తరాలపల్లి గ్రామంల్లోనూ జెండాలను ఎగురవేశారు. జిల్లా ప్రచార కార్యదర్శి జేరిపోతుల భిక్షపతి, జేరిపోతుల దేవేందర్, దువ్వ లింగమూర్తి, కటిక కుమారస్వామి, నరేష్, శ్రీనివాస్, చిన్న కుమార్, సురేష్, భిక్షపతి, అరుణ్, సురేష్, రాజేందర్, అనిల్, భాస్కర్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవలు అభినందనీయం

కాజీపేట అర్బన్: భూమి పునరుద్ధరణకు ఏసెజ్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న ప్రాజెక్ట్ అభినందనీయమని వరంగల్ ఎంపీ కడియం కావ్య ప్రశంసించారు. దేవుని సంఘం విశ్వవిద్యాలయ విద్యార్థుల ఆధ్వర్యంలో భట్టుపల్లి గ్రామంలోని చెరువు వద్ద ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ కావ్య సోమవారం హాజరై మొక్కలు నాటారు.

ఉబేద్ బాబాతో కొండా మురళీధర్‌రావు భేటీ

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని దర్గా పీఠాధిపతి ఉబేద్ బాబా నివాసానికి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సోమవారం వెళ్లారు. ఈ సందర్భంగా ఉబేద్‌బాబాతో మురళీధర్ రావు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు. నవీన్‌రాజ్, నల్గొండ రమేష్, కొత్తపెల్లి శ్రీనివాస్, మీసాల ప్రకాశ్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు


మెట్టుగుట్టపై అభిషేకం చేస్తున్న భక్తులు


కాశిబుగ్గ: స్వామివారికి హారతి పడుతున్న మహిళలు

మడికొండ: కాజీపేట మండలం మడికొండలో మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి శ్రావణమాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి అభిషేకాలు, నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారికి అన్నపూజ నిర్వహించారు. అలాగే సీతారాచంద్రస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అర్చనలు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషభారతి, శివాలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో..

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఆలయంలోని సహస్ర లింగానికి 39 లీటర్ల పాలతో అభిషేకం, మధ్యాహ్నం అన్నపూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

మల్లన్నకు పూలతో అలంకరణ

కాజీపేట: కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రావణ మాసోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రావణ మొదటి సోమవారం కావడంతో లక్ష పూలతో మహాదేవుడికి అర్చకులు అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయినవోలు ప్రవీణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకంతో పాటు పూలతో అలంకరణ చేశారు.

ఆలయ సుందరీకరణ పనులు ప్రారంభం

ఖిలా వరంగల్: శ్రావణమాసం సందర్భంగా వరంగల్ శంభునిపేటలోని పోచమ్మ ఆలయంలో సుందరీకరణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. పోచమ్మ గుడికి రంగులు వేయడం, విద్యుత్ దీపాల ఏర్పాటు, గోడలకు అమ్మవారి చిత్రాలు, నాగసర్పం బొమ్మలను చిత్ర కళాకారులు వేస్తున్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

హన్మకొండ: చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సఖి కేంద్రం కేసు వర్కర్ హరిత అన్నారు. హనుమకొండ టీవీ టవర్ కాలనీలోని విద్యామందిర్ కళాశాలలో సఖి సెంటర్ సేవలపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ సఖి కేంద్రం ఐదు రకాల సేవలు అందిస్తోందని తెలిపారు. బాధిత మహిళలు, బాలికలకు కౌన్సెలింగ్, వైద్య, పోలీస్, తాత్కాలిక వసతి న్యాయ సహాయం అందిస్తున్నట్లు వివరించారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసేచోట వేధింపులు, అత్యాచారాలకు గురైన బాధిత మహిళలకు సహాయం అందించనున్నట్లు వివరించారు. బాధిత మహిళలు 181, 0870 2452112 నంబర్లకు ఫోన్ చేసి తక్షణ సాయం పొందవచ్చని ఆమె సూచించారు.


సదస్సులో మాట్లాడుతున్న హరిత

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం


బాండ్లను అందజేస్తున్న శ్రీనివాసరావు

హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ పార్టీ కోసం, ఎమ్మెల్యేగా నాయిని రాజేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. 20 మంది కాంగ్రెస్ సోషల్ మీడియా వారియర్లకు ఒక్కొక్కరికి రూ. 3లక్షల ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో రాజేందర్‌రెడ్డి విజయం కోసం సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ యువ కార్యకర్తలు ఎంతో శ్రమించారని కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఈవీ శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ అశోక్ రావు, కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి, నాయకులు ధనుంజయ్, రమేష్, నవీన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణకు స్వాగతం పలుకుదాం

కేయూ క్యాంపస్: ఈనెల 8న న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు రాబోతున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు శంషాబాద్ వద్ద ఘన స్వాగతం పలుకుదామని కాకతీయ యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఈసం నారాయణ, జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగానే ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. సమావేశంలో కేయూ ఎడ్యుకేషన్ కళాశాల సూపరింటెండెంట్ బొల్లె పాక ప్రభాకర్, బాధ్యులు డాక్టర్ సంగాల ఎఫ్రిమ్ రాజు, నమిండ్ల కిరణ్‌కుమార్, సంగాల దయాకర్, బొక్క మొగిలి, దామెర ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.